క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు: 11 కేవీ ఫీడర్లు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్ -1 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ ముస్తాక్ అహ్మద్ శనివారం తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వకు సరఫరా ఉండదని చెప్పారు. రైలుపేట, సాంబశివపేట, రైల్వేస్టేషన్ రోడ్డు, పాత్తూరువారి తోట, కొత్తపేట ప్రాంతాల విని యోగదారులు సహకరించాలని కోరారు.

నేడు, రేపు మూట్ కోర్టు పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని జాగర్లమూడి చంద్రమౌళీ న్యాయ(జేసీ లా) కళాశాలలో శని, ఆదివారాల్లో జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రారంభ కార్యక్రమానికి విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయ వీసీ ఆచార్య డి. సూర్యప్రకాశరావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. దేశంలోని 35 విద్యాసంస్థలకు చెందిన న్యాయ విద్యార్థులు పోటీలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

మహాత్మా గాంధీకి నివాళి

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాంధేయవాది అచ్యుత ఇందుశేఖర్‌తో పాటు కె.చంద్రశేఖర్, టీవీ సాయిరాం, సదాశివం సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంపాలెం పోలీస్ స్టేషన్ తనిఖీ



లక్ష్మీపురం: గుంటూరు నగరంలోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌ను వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ అరవింద్ శుక్రవారం తనిఖీ చేశారు. తొలుత పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ 112కు వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో నీలరాజుకు స్వర్ణ పతకం



లక్ష్మీపురం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరుగుతున్న 38వ జాతీయ క్రీడా పోటీల్లో గుంటూరుకు చెందిన కె.నీలరాజు బంగారు పతకం సాధించాడు. వెయిట్ లిఫ్టింగ్ 67 కేజీల విభాగంలో నీలరాజు గోల్డ్‌మెడల్ గెలుచుకున్నాడు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు నాగరాజుకు శాప్ ఛైర్మన్ రవినాయుడు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. నీలరాజు విజయం తెలుగువారు గర్వించదగ్గర విషయమన్నారు.

షేర్ల పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: షేర్లలో లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి ఆన్‌లైన్ ద్వారా పరిచయం చేసుకుని రూ.7 లక్షలు పెట్టుబడి పెట్టించి మోసం చేయడంతో బాధితుడు పట్టాభిపురం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు నవభారత్‌నగర్ ప్రాంతానికి చెందిన ప్రతాప్‌రెడ్డి, గత ఏడాది డిసెంబర్ 12వ తేదీన ఫేస్‌బుక్‌లో గుర్తు తెలియని వ్యక్తి లింక్‌ను పంపించాడు. ఈ లింక్ క్లిక్ చేయడంతో షేర్లలో పెట్టుబడి పెట్టడం వల్ల అధిక లాభాలు ఆర్జించ వచ్చని నమ్మించాడు. ప్రతాప్‌రెడ్డితో షేర్లు కొనుగోలు చేయించాడు. అయితే షేర్లలో అధిక లాభాలు చూపించడంతో వచ్చిన లాభాలను విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం లేదు. ఇంకా షేర్లు కొనుగోలు చేయాల్సిందిగా చెబుతున్నాడు. దీంతో దిక్కుతోచక శుక్రవారం సాయంత్రం పట్టాభిపురం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

లక్ష్మీపురం: మానసిక వైకల్యంతో ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధురాలు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. బృందావన్ గార్డెన్స్‌కు చెందిన నిమ్మగడ్డ శ్రీధర్ భార్య నిమ్మగడ్డ లావణ్య(67)లకు కుమారులు ఇద్దరు విదేశాల్లో ఉంటున్నారు. శ్రీధర్, గుంటూరు మెడికల్ కళాశాలలో ఎల్‌డీసీగా పని చేసి రిటైర్డ్ అయ్యాడు. లావణ్య ఎనిమిదేళ్లుగా మానసిక జబ్బుతో బాధ పడుతోంది. ఈనెల 29వ తేదీన తెల్లవారుజామున శరీరానికి నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని గమనించిన భర్త స్థానికుల సహాయంతో ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. అప్పటికే 75 శాతం శరీరం కాలిపోయింది. చికిత్స పొందుతున్న లావణ్య శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు మృతురాలి వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్టాండ్ వద్ద అడ్డగోలుగా..

- నడిరోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్ దందా
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న ప్రైవేట్ బస్సులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- ఫిర్యాదులు అందుతున్నా... సమస్య వినే నాథుడేడి...



ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై అడ్డంగా నిలబెట్టిన ప్రైవేట్ బస్సులు

పట్నంబజారు: నిబంధనలు కట్టుదిట్టం చేస్తామంటారు.. నోటీసులు జారీ చేశామని చెబుతూనే ఉంటారు.. కానీ బస్సులు మాత్రం అడ్డగోలు అడ్డు పెడుతూనే ఉంటారు.. అయినా అదీ ట్రాఫిక్ పోలీసుల కంటికి కనపడదు.. ఆర్టీఏ అధికారులకు నిబంధనలు గుర్తుకు రావు.. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా.. అధికారుల్లో మాత్రం నిర్లక్ష్యం ఛాయలు వీడటం లేదు.

భారీగా ప్రైవేట్ ట్రావెల్స్..

గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద సుమారు 60కుపైగా ప్రైవేట్ ట్రావెల్స్ ఉన్నాయి. ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో బస్సులు ఉండకూడదన్న నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ.. పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఆర్టీసీ బస్టాండ్‌కు రెండు కిలోమీటర్లు పరిధిలో ప్రైవేట్ వాహనాలు ఉండకూడదన్నది... నిబంధనల్లో ఉంది. ఇదే విషయాన్ని ఆర్టీసీ అధికారులు ఆర్టీఏ అధికారులకు విన్నవించినా.. ఎటువంటి ప్రతిఫలం లేదు. ఆఖరికి సంక్రాంతి పండుగ సమయంలో ఆన్‌లైన్ ద్వారానే భారీగా వసూలుకు తెరదీశారు. ఇక ఆఫ్‌లైన్‌లో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దాని సంగతి పక్కనే పెడితే.. ప్రైవేట్ బస్సులతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతూనే ఉంది. పలుమార్లు ఆర్టీఏ, ఆర్టీసీ అధికారులు ట్రాఫిక్ పోలీసులకు సమస్యను విన్నవించినప్పటికీ వారి గోడు.. గోడుగానే మిగిలిపోయింది.

కూతవేటు దూరంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్..

ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో బస్సులు అడ్డుగోలుగా అడ్డంగా నిలుబెడుతున్నప్పటికీ కనీసం పట్టించుకున్న పాపాన పోవటంలేదు. ఇదేమని ప్రశ్నిస్తే.. ట్రాఫిక్ పోలీసులకు చెబితే.. ఏమైనా అవుతుందా..? అనే సమాధానం ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకుల నుంచి ఎదురౌతోంది. బస్టాండ్ వద్ద నిత్యం సాయంత్రం ఏడుగంటలకు మొదలుకుని.. రాత్రి 11 గంటల వరకు మాకు అడ్డు లేదు.. అనే చందంగా నడిరోడ్డుపై అడ్డుపెడుతున్నారు. కనీసం ఒక హోంగార్డును కూడా అక్కడ ఉంచకపోవటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ట్రాఫిక్ అధికారులకు ప్రశ్నిస్తే.. మాత్రం నోటీసులు జారీ చేశాం .. జరిమానాలు విధిస్తున్నాం అని చెప్పటం తప్ప చేస్తోంది ఏమి లేదనే వాదనలు వినవిస్తున్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్ నుంచి నెలవారీలు వస్తుండటంతోనే పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ క్రమంలో నెలవారీ మామూళ్లు స్టేషన్‌కు అందుతుండటంతో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం ఎన్ని కేసులు నమోదు చేశారో.. చెప్పాలని ఆ స్టేషన్ సిబ్బందిని అడినా... వారి నుండి సరైన సమాధానం లభించలేదు. తాత్కాలికంగా కేసులు నమోదు చేసి.. తామేదో పని చేసినట్లుగా చెప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సుల నిలుపుదలపై ఇప్పటికే ఈస్ట్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసి, జరిమానాలు విధించాలని చెప్పాం. జరిమానాలు విధిస్తున్నప్పటికీ బస్సుల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. సదరు స్టేషన్ అధికారులతో చర్చించి. తీసుకుంటున్న చర్యలపై స్పష్టత కోరతాం. పలుమార్లు ఇప్పటికే ఈస్ట్ ట్రాఫిక్ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ప్రైవేట్ ట్రావెల్ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసిన చర్యలు తీసుకుంటాం.

– ఎం.రమేష్, ట్రాఫిక్, డీఎస్పీ

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



లక్ష్మీపురం: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, జిల్లా సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం విన్నవించిన అనంతరం చాంద్‌బాషా మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో సుమారు ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉండి పనిచేస్తున్న గ్రేడ్- 2 వసతి గృహ సంక్షేమ అధికారులకు గ్రేడ్ -1 అధికారులుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. కరోనా సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారిస్తామని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామిరెడ్డి, నగర శాఖ ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, శరత్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి కోటా సాహెబ్, మహిళా విభాగం నాయకురాలు శ్రీమతి మల్లేశ్వరి, రోజా, పెన్షన్ సంఘ నాయకులు రాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి ధర లభించేలా చూడాలి

- మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత
- వ్యాపారులు, అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ ఎం.విజయ సునీత

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి రైతులకు ఆశించిన ధర లభించేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత స్పష్టం చేశారు. గుంటూరు చుట్టుగుంటలోని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కార్యాలయం సమావేశ మందిరంలో మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, మార్కెటింగ్ శాఖ అధికారులతో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం సీజన్ ప్రారంభం నుంచి మిర్చి ధరలు ఎందుకు పతనం అవుతున్నాయో ఎగుమతి వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులు వెలగపూడి సాంబశివరావు, తోట రామకృష్ణ, కొత్తూరి సుధాకర్, పి.నరేంద్ర, కె.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో రైతులకు లభిస్తున్న ధరలు నిలకడగా ఉన్నాయని చెప్పారు. గతంతో పోలిస్తే చైనా, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాలకు ఎగుమతులు ఆశాజనకంగా లేవని తెలిపారు. ప్రస్తుతం శీతల గిడ్డంగులలో ఉన్న మిర్చి నిల్వలు ఎగుమతికి అనుకూలంగా లేవని పేర్కొన్నారు. దీంతో ధరలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదని వెల్లడించారు. ఫిబ్రవరి 15వ తేదీ తర్వాత పంట దిగుబడులు, మిర్చి ఎగుమతులపై ఒక అంచనా వస్తుందని, అప్పటి వరకు మిర్చి ధరలు నిలకడగా ఉంటాయని వివరించారు. ఫిబ్రవరి 15 తర్వాత చైనా దేశం నుంచి ఎక్స్‌పోర్టర్స్ రావచ్చని, అప్పుడు ధరల్లో మార్పు రావచ్చని సూచించారు. ఇంతకన్నా మిర్చికి మార్కెట్ రాదని వారు స్పష్టం చేశారు. కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.94 లక్షల హెక్టార్లలో మిరప పంట సాగు చేయగా 11.29 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. గుంటూరు మిర్చి యార్డుకు మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా రైతులు సరకు తెచ్చే అవకాశం ఉన్నందున గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనికి సహకరించాలని ఎగుమతి వ్యాపారులకు సూచించారు. మిర్చి సీజన్ ప్రారంభమైనందున గుంటూరు మార్కెట్ యార్డుకు అధిక సంఖ్యలో బస్తాలు వస్తున్నందున అసౌకర్యం కలగకుండా చూడాలని యార్డు అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ తర్వాత తదుపరి సమావేశం ఉంటుందని వెల్లడించారు. మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, విజిలెన్స్ జేడీ రాజశేఖర్, ఏడీఎం బి.రాజబాబు, మిర్చి యార్డు కార్యదర్శి ఎ.చంద్రిక, వ్యాపారులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికైన రామచంద్రరాజు



గుంటూరు ఎడ్యుకేషన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖ కోశాధికారిగా గుంటూరు నగరానికి పి.రామచంద్రరాజు ఎన్నికయ్యారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన రెడ్ క్రాస్ రాష్ట్ర సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1991 నుంచి రెడ్ క్రాస్ సభ్యునిగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రామచంద్రరాజు రెడ్ క్రాస్ గుంటూరు జిల్లా వైస్ చైర్మన్‌గా సేవలను విస్తృత పరిచారు. గుంటూరు నగరంలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిర్ ట్రస్టుతో పాటు భారతీయ విద్యా భవన్ కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారిగా ఎన్నికైన రామచంద్రరాజు రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ గౌరవాధ్యక్షులైన అబ్దుల్ నజీర్ సమక్షంలో త్వరలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈసందర్భంగా ఆయనకు నగరంలోని వివిధ రంగాల ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఎన్నికల నియమావళికి అభ్యర్థులు సహకరించాలి



నెహ్రూనగర్: ఉమ్మడి కృష్ణ, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల నియమావళి అమలుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 29 నుంచి ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నామని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని కోరారు. నగరంలో ఎన్నికల నియామావళి అమలులో భాగంగా వార్డు సచివాలయాల వారీగా వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్‌లను పట్టణ ప్రణాళిక విభాగ ఆధ్వర్యంలోని దళం తొలగిస్తున్నాయన్నారు. రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలను ముసుగులతో కప్పి వేయడం జరుగుతుందని చెప్పారు. వార్డు సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలని, నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు.

జ్యూట్‌తో తయారీ వస్తువులు వినియోగించాలి



మాట్లాడుతున్న టీవీ రావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధి, పర్యావరణ రక్షణ కోసం జ్యూట్‌తో తయారు చేసిన వస్తువులనే ఉపయోగించాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్త టీవీ రావు అన్నారు. చుట్టుగుంటలోని ల్యాంప్ సంస్థ కార్యాలయంలో జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఇటువంటి ఉచిత శిక్షణ ద్వారా ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ ప్రతి మహిళా ఒక పారిశ్రామిక వేత్త స్థాయికి ఎదగాలని అన్నారు. 15 రకాల ఉత్పత్తుల తయారీలో రెండు నెలలపాటు ఉచిత శిక్షణ కల్పించి, శిక్షణానంతరం ఉపాధి చూపిస్తామని తెలిపారు. ల్యాంప్ సంస్థ ప్రతినిధి వెంకటేశ్వరరావు, నల్లపాడు మాజీ సర్పంచి విప్పర్ల విజయ భాస్కర్ మాట్లాడారు. వివరాలకు 99124 02364లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ దాసరి ఆమని, ల్యాంప్ సంస్థ ప్రతినిధులు షేక్ బాజీ, మంగయ్య, శ్రీవల్లి పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్రామాయణ ప్రవచన నవాహ జ్ఞానయజ్ఞం



మాట్లాడుతున్న శలాక రఘునాథశర్మ

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై దివంగత ముప్పవరపు కేశవరావు శత జయంతి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తోన్న శ్రీవాల్మీకి మహర్షి ప్రణీత శ్రీ మద్రా మాయణ ప్రవచన నవాహ జ్ఞానయజ్ఞం శుక్రవారంతో ముగిశాయి. ముప్పవరపు వెంకట సింహాచలశాస్త్రి, భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మస్తానయ్య, లంకా విజయబాబు, పుట్టగుంట ప్రభాకరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కుంభకర్ణుడితోపాటు అనేక మంది రాక్షస వీరుల మరణం, ఇంద్రజిత్ నాగాస్త్ర ప్రయోగం, మారుతీ ఔషధ పర్వతం తెచ్చిన విధానం, రావణ వధ, సీతమ్మ వారి అగ్నిప్రవేశం శ్రీరామ పట్టాభిషేకం వంటి విషయాలను మహా మహోపా ధ్యాయ బ్రహ్మశ్రీ శలాక రఘునాథశర్మ (హైదరాబాద్) వివరించారు. తొలుత శ్రీరామచంద్ర ప్రభువుకు సంగీత నీరాజనంగా మండ అనంతకృష్ణ (తిరుపతి) వేణుగాన కచేరి జరగ్గా, అలరించింది. అనంతరం శలాక రఘునాథశర్మ, ముప్పవరపు వేంకటసింహాచలశాస్త్రిను సత్కరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

- అదనపు కమిషనర్ ఓబులేసు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



వివిధ పార్టీ ప్రతినిధులతో సమావేశమైన అదనపు కమిషనర్ ఓబులేసు

నెహ్రూ నగర్: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల కోసం గుంటూరు తూర్పు(94), పశ్చిమ నియోజకవర్గం(95)లో 1000 మంది దాటిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేస్తూ ప్రకటించిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటామని పశ్చిమ ఏఈఆర్‌ఓ, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 1000 మందికి మించిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను, అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటుకు డ్రాఫ్ట్ తయారు చేశామన్నారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సూరజ్ కుమార్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మనాభరావు, డెప్యూటీ తహసిల్దార్ నాగ మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు నాయుడు ఓంకార్(టీడీపీ), పాండురంగ విఠల్(బీజేపీ), సిహెచ్.వాసు(బీఎస్పీ), బి.సునీల్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) కె.నళినికాంత్(సీపీఎం), టి.సేవా కుమార్ (అమ్ ఆద్మీ పార్టీ), సిహెచ్.రామ వెంకట త్రినాథ్(జనసేన) తదితరలు పాల్గొన్నారు.

'పీపుల్స్ లిటరేచర్' సంచిక ఆవిష్కరణ



'పీపుల్స్ లిటరేచర్' సంచిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

నగరంపాలెం: సనాతనం పేరుతో హీన, బానిస భావ, పతన సంస్కృతిని ప్రోత్సహిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా భావ సారూప్య ప్రజాస్వామ్య శక్తులతో ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించేందుకు సిద్ధమవ్వాలని అఖిల భారత ప్రజాసాహిత్య, సాంస్కృతిక వేదిక (ఏఐపీఎల్‌సీఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు అన్నారు. గుంటూరు వైద్యకళాశాల ఎదురున్న ఎన్‌జీవో అసోసియేషన్ హాల్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న అఖిల భారత ప్రజాసాహిత్య, కళా సాంస్కృతిక సభలను శుక్రవారం ప్రారంభించారు.
వివిధ రాష్ట్రాల ప్రజా కళాకారుల డప్పుల, గజ్జల దరువులతో స్వాగతించారు. ఏఐపీఎల్‌సీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్రకళ ప్రదర్శనను ప్రముఖ చిత్రకారులు టి.వెంకట్రావు ప్రారంభించగా, జాతీయ ఉపాధ్యక్షులు దివి కుమార్ సభ స్వాగతం పలకగా, నాయకులు రమణప్రసాద్ అధ్యక్షత వహించారు. 'పీపుల్స్ లిటరేచర్ 11' సంచికను రవిబాబు ఆవిష్కరించి ప్రసంగించారు. సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, సీఎస్ఆర్ ప్రసాద్, కాట్రగడ్డ దయానంద్, గౌతమ్ ముఖర్జీ, సుగధన్‌పాల్ ప్రసంగించారు. ఆదివాసి నాయకులు రాంజీ గోల్డ్ జీవిత చరిత్రపై ఆదివాసి చిన్నారులు ప్రదర్శించిన 'బుడతల బుర్రకథ', శ్రీకాకుళోద్యమ గిరిజన పోరాట చరిత్రపై డాక్యు డ్రామ 'పోరు దారి' అలరించాయి.

వాసవీ మాత ఆత్మార్పణ దినం



వాసవీమాతను పూజిస్తున్న అవోపా సభ్యులు, మహిళలు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ వైశ్యులు త్యాగానికి మారుపేరని, సేవా గుణంలో ముందుంటారని తెలిపారు. వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు వాసవీ మాతకు ఘనంగా కుంకుమ పూజలు, లలితా సహస్రనామాలు, వాసవి అష్టోత్తరాన్ని పఠించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, రాష్ట్ర కార్యదర్శి రాచపూడి సుబ్బారావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, మహిళా విభాగం సభ్యులు రత్నశ్రీ, విజయ, పూర్ణేశ్వరి, సునీత, కోటి రత్నం పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను రద్దు చేయాలి



లక్ష్మీపురం: ఫెడరల్ హక్కులను కాలరాసే, ప్రభుత్వ యూనివర్సిటీలను మూసివేసే కుట్రలకు యూజీసీ ప్రయత్నిస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ పేర్కొన్నారు. కొత్తపేట భగత్ సింగ్ సర్కిల్ వద్ద నుంచి అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యను మరింత కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, కాషాయికరణ చేసే దిశగా బీజేపీ చర్యలు తీసుకుంటుందని ఆరోపించారు. యూజీసీ నిబంధనల ద్వారా కేంద్రం రాష్ట్రాల హక్కులను లాక్కుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, సహాయ కార్యదర్శి అమర్నాథ్, నగర అధ్యక్షులు సాయి, అమీర్, ఆనంద్, ప్రభాస్, కళ్యాణ్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో 'అభ్యుదయ' ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం శుక్రవారం విడుదల చేసిన డిగ్రీ చివరి సంవత్సర మూడో సెమిస్టర్ ఫలితాల్లో అభ్యుదయ కళాశాల విద్యార్థినులు యూనివర్సిటీస్థాయిలో అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బీఎస్సార్కే ప్రసాద్, బి. రోహిణిదేవి తెలిపారు. లక్ష్మీపురంలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మైక్రో బయాలజీ, బయో టెక్నాలజీ, సీఎస్, డేటాసైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బీసీఏ, మల్టీమీడియా, బీకాంలో అత్యధిక మార్కులతో ప్రతిభ కనబర్చినట్లు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థినులను అభినందించారు.

మతాల మధ్య చిచ్చు పెడుతున్న ఎన్డీఏ ప్రభుత్వం

సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

లక్ష్మీపురం:దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మతాల మధ్య, కులాల, ప్రాంతాల మధ్య చిచ్చులు రేపుతూ పరిపాలిస్తున్న పరిస్థితులు చూస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆరోపించారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.